క్లుప్తంగా

మూఢ నమ్మకాలపై 'కళాజాత'



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

పెందుర్తి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాశాలు లేని సమాజం కోసం ఏం చేయాలన్న అంశాలపై పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం కళాజాత నిర్వహించారు. మూఢ నమ్మకాలు సమాజానికి ఎంత చేటో పాటలు, నాటికల ద్వారా విద్యార్థులకు వివరించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి మురళీధర్, ప్రతినిధులు శేషగిరిరావు, రాధారాణి, శ్రీకాంత్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటించండి

మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజన్న



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీ రాజన్న

సబ్బవరం: వాహనాలు నడిపేవారు విధిగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీ) టి.రాజన్న సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం సబ్బవరంలో ఆటో, హెవీవెహికల్స్ డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రోడ్డు మార్జిన్లు, సిగ్నల్స్ పాటించడంతో పాటు నిర్ణీత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలని,నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు.సెల్ ఫోన్ మాట్లాడుతూ,మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అలా పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అనంతరం భద్రతా నియమాలతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శివరామ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

8 కిలోల గంజాయి పట్టివేత

ముగ్గురి అరెస్ట్

పెందుర్తి: సరిపల్లి సమీపంలోని పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పెందుర్తి, నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. ముగ్గురి నుంచి 8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలివి..తమిళనాడుకు చెందిన గజేంద్ర, డి.రమేష్, అరకు ప్రాంతానికి చెందిన కిల్లో కేశవరావు సరిపల్లి చెక్ పోస్టు సమీపంలో నడిచివస్తున్నారు(ఆర్టీసీ బస్‌లో వచ్చి చెక్ పోస్టు వద్ద దిగిపోయినట్లు అనుమానం). వీరు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారిని అడ్డుకుని బ్యాగ్‌లు పరిశీలించగా గంజాయి పట్టుబడింది. దీంతో గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పేకాట రాయళ్ల అరెస్ట్

రూ.40 వేల నగదు స్వాధీనం

పెందుర్తి: వేపగుంట సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.40,050 నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి..వేపగుంట సమీపంలోని ఓ తోట వద్ద పేకాట ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీనిపై సీపీ రవిశంకర్, స్పెషల్ బ్రాంచ్ అడిసినల్ కమిషనర్ వెంకటరావు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని పెందుర్తి పోలీసులకు అప్పగించారు. సీఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగిన పెన్షనర్ల నిరసన

విశాఖ విద్య: ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్రిపాలెం పీఎఫ్ కార్యాలయం ముందు చేపట్టిన నిరసన నాలుగో రోజు గురువారం కూడా కొనసాగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దీనబంధు, కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడం బాధాకరమన్నారు. మినిమమ్ పెన్షన్ మంజూరయ్యేలా కేంద్ర ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకోవాలన్నారు.

ప్రగతి రథం.. సంక్షేమ పథం

రూ.11.35 కోట్లతో అభివృద్ధి పనులు

మారిన పరవాడ రూపురేఖలు



పరవాడలో నిర్మించిన జగనన్న కాలనీ సముదాయం



బీసీ కాలనీలో నిర్మించిన గ్రామ సచివాలయ భవన సముదాయం

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ ప్రగతి పథంలో దూసుకుపోతోంది. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు సహకారంతో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పరవాడ గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. పరవాడ, బీసీ కాలనీ, న్యూ కాలనీ, సినిమాహాలు కూడలి ప్రాంతాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. రెండు గ్రామ సచివాలయ భవనాలు నిర్మించి ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తెచ్చింది. పలుచోట్ల సీసీ రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మించింది. అధ్వానంగా మారిన పాఠశాలలను నాడు–నేడులో అభివృద్ధి చేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దింది.

తాగునీటి కష్టాలకు చెక్

వేసవిలో తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్న ప్రజలకు జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటి కుళాయిలు, రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేసి తాగునీటి కష్టాల నుంచి గట్టెక్కించింది. తల దాచుకోవడానికి గృహ వసతి లేక ఇబ్బందులు పడుతున్న అనేక మంది నిరుపేద కుటుంబాలకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా గృహాలను నిర్మించింది. నిరుపేదల గుండెల్లో జగనన్న ప్రభుత్వం స్థానం సంపాదించింది. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కోట్లాది రూపాయల మేర ప్రత్యక్ష, పరోక్ష ప్రయోజనాలు చేకూర్చింది.

సంక్షేమం పథకాల ద్వారా పొందిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	డబ్బు
వైఎస్సార్ పెన్షన్ కానుక	863	రూ.7.98 కోట్లు
వైఎస్సార్ చేయూత	466	రూ.2.17 కోట్లు
వైఎస్సార్ ఆసరా	1307	రూ.5.86 కోట్లు
వైఎస్సార్ సున్నా వడ్డీ	1547	రూ.28.78 లక్షలు
విద్యా దీవెన	520	రూ.2.08 కోట్లు
రైతు భరోసా	770	రూ.3.81 కోట్లు
వైఎస్సార్ ఆరోగ్య	182	రూ. 82.81 లక్షలు
ఇళ్ల స్థలాలు	290	రూ. 7.13 కోట్లు
విద్యా కానుక	166	రూ.11.78 లక్షలు
జగనన్న తోడు	279	రూ 51.94 లక్షలు



పరవాడలో ఏర్పాటు చేసిన సీసీ రహదారి



పరవాడ కళాశాల వద్ద నిర్మించిన సీసీ కాలువ



జగనన్న కాలనీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అదీప్, ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి(ఫైల్)

ఇది కదా అభివృద్ధి

పరవాడ పంచాయతీ

జనాభా: 12,500

- అభివృద్ధి పనులకు ఖర్చు చేసిన నిధులు: రూ.11.35 కోట్లు
- రెండు గ్రామ సచివాలయ భవనాలకు : రూ.75 లక్షలు
- రైతు భరోసా కేంద్ర నిర్మాణం రూ.21.80 లక్షలు
- సీసీ రహదారుల నిర్మాణం రూ.51 లక్షలు
- బీసీ కాలనీలో ఎంపీపీ పాఠశాల ఆధునికీకరణకు : రూ. 23 లక్షలు
- న్యూ కాలనీ, ఎస్సీ కాలనీ, కల్యాణ మండపం ప్రాంతాల్లో సీసీ కాలువల నిర్మాణం: రూ.74 లక్షలు
- కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం : రూ.16.5 లక్షలు
- సినిమాహాలు కూడలిలో మంచినీటి పథం ఏర్పాటుకు : రూ.20 లక్షలు
- ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు : రూ.1.97 కోట్లు
- 298 మంది ఇళ్ల నిర్మాణానికి : రూ.3.52 కోట్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరవాడ గ్రామంలో అభివృద్ధి సాధ్యపడింది. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సహకారంతో గ్రామంలో తాగునీరు, సీసీ రహదారులు, కాలువలు, పాఠశాలల అభివృద్ధి, జగనన్న కాలనీలో నిరుపేదలకు లబ్ధి చేకూరింది. కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మించాం. లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేశాం. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హత కలిగిన వారందరికీ అందించాం. గ్రామాన్ని ఆదర్శంగా నిలపడానికి సమష్టిగా కృషి చేస్తున్నాం.

– సిరపరపు అప్పలనాయుడు, సర్పంచ్, పరవాడ

జగన్ బాబుకు రుణపడి ఉంటాం



కొన్నేళ్ల కిందట విజయనగరం జిల్లా బొబ్బిలి దరి జోగంపేట నుంచి పండ్ల వ్యాపారం నిమిత్తం పరవాడ గ్రామానికి వలస వచ్చాం. నాకు ముగ్గురు సంతానం. సొంతిల్లు లేక అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. చిరు వ్యాపారంపై వచ్చే అరకొర ఆదాయం ఇల్లు గడవడానికే సరిపోయేది. సొంతింటి కోసం దరఖాస్తు చేశాను. ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం కోసం ఇసుక, ఇనుం, సిమెంటు ప్రభుత్వమే సరఫరా చేసింది. ఇల్లు నిర్మాణం పూర్తి చేసి ఇటీవలే గృహ ప్రవేశం చేశాం. జీవితాంతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– బొమ్మినాయిని అమ్మదమ్మ, జగనన్న కాలనీ, పరవాడ

హాయిగా రాకపోకలు



తేలిక పాటి వర్షాలకే బాలికల వసతి గృహం వద్ద వర్షపు నీరు నిలిచిపోయేది. దీంతో కాలనీ ప్రజలు, వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బంది పడేవారు. ఇక్కడ కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మించాలని గత ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం శూన్యం. జగనన్న ప్రభుత్వంలో హాస్టల్ పక్క నుంచి సీసీ రోడ్డు, కల్వర్టుతో నిర్మించారు. దీంతో మా కాలనీతో పాటు విద్యార్థుల కష్టాలు తీరాయి.

– ఎం.దేముడమ్మ, పరవాడ

కాలువ నిర్మాణంతో తప్పిన కష్టాలు



ఏ మాత్రం వర్షం కురిసినా ఆర్‌ఈసీఎస్ కార్యాలయం వద్ద వర్షపు నీరు నిలిచిపోయి రైతులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడేవారం. ఆ ప్రదేశం లోతట్టుగా ఉండడంతో నీరు నిలిచిపోయేది. సమస్యను గత ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వం అధికారంలో రాగానే ఆర్‌ఈసీఎస్ కార్యాలయం సమీపంలో సీసీ డ్రైను, కాలువ నిర్మించడంతో మా తమ కష్టాలు తీరాయి. ఇప్పుడు సౌకర్యంగా ఉంది.

– గండి ఈశ్వరరావు, వార్డు సభ్యుడు, పరవాడ

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకుడు చక్రవర్తి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో భ్రమరాంబ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందజేస్తున్న రాపేటి రాము తదితరులు

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం బై జూస్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. 7,8వ తరగతి విద్యార్థులకు బై జూస్ కంటెంట్‌తో ఉన్న ట్యాబ్‌లను వైఎస్సార్‌సీపీ నాయకుడు రాపేటి రాము పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు,అప్పలరాజు,కిల్లి సత్యనారాయణ,పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విభాగం ప్రగతి సాధించాలి



బీవోఎస్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రతీ విభాగం ప్రగతిలో భాగం కావాలని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. గురువారం ఉదయం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన బీవోఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విభాగంలో ఆచార్యులు సాధించిన అవార్డులు, పేటెంట్లు, వారు పాల్గొన్న జాతీయ, అంతర్జాతీయ సదస్సులు వంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు విభాగాల వారీగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఒక ప్రత్యేక విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇలా చేస్తే విభాగ స్థాయి నుంచి విశ్వవిద్యాలయం వరకు అభివృద్ధికి సంబంధించిన సమగ్ర సమాచారం ఒక డాక్యుమెంట్ రూపంలో అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం నాక్ సన్నద్ధత జరుగుతుందన్నారు. ఏడేళ్ల తరువాత నాక్ స్కోర్ కనీసం 3.8 గ్రేడ్ పాయింట్ల కంటే అధికంగా సాధించే లక్ష్యంతో విభాగాలలో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్సిటీలో ఏటా ఇంటర్నల్ ఆడిట్ చేయడం, నాక్‌కు సమాచారాన్ని సిద్ధం చేయడం ఎంతో ప్రధానమన్నారు. అనంతరం పలు అంశాలపై సభ్యులు చర్చించి, సూచనలు స్వీకరిస్తూ, నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్ బాబు, ప్రిన్సిపాళ్లు, బీవోఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

అందుబాటులోకి నింబస్ యాప్ సేవలు



నింబస్ సేవలు ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయంలో ఈ–రిసోర్సెస్‌ని విద్యార్థులకు అందుబాటులో ఉండేలా కొత్తగా నింబస్ ఎం లైబ్రరీ మొబైల్ యాప్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గురువారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో నింబస్ యాప్ సేవలను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ప్రారంభించారు. విభిన్న డిజిటల్ రిసోర్సెస్‌ని విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు ఉపయుక్తంగా నిలిపేలా ఈ సేవలు దోహదపడనున్నాయి. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేకంగా హాస్టళ్లలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, లైబ్రేరియన్ ఆచార్య పి.వెంకటేశ్వర్లు, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్ బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య టి.శోభశ్రీ, కె.విశ్వేశ్వర రావు, ఆచార్య వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకోవాలని వినతి



కేరళ ముఖ్యమంత్రి విజయన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి సహకరించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కోరారు. గురువారం ఆయన్ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం 66 గ్రామాలకు చెందిన ప్రజలు తమ భూములు కోల్పోయారన్నారు. సొంత గనులు కేటాయించకపోయినప్పటికీ కేంద్ర ప్రభుత్వానికి వివిధ పన్నులు, లాభాల రూపేణా రూ.55 వేల కోట్లు తిరిగి చెల్లించిందన్నారు. మరోవైపు సెయిల్‌ను విస్తరించడానికి ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తే ఇరు సంస్థలకు లాభదాయకమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ రద్దు చేయడంతో పాటు సెయిల్‌లో విలీనం చేయించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, ఎన్.రామారావు, చీకటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తో దేశానికి ఎంతో మేలు

మధురవాడ: సైన్స్ దేశానికి ఎంతో మేలు చేస్తోందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.మురళీధర్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సైన్స్ కళా బస్ యాత్ర గురువారం ఉదయం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతోపాటు అన్ని వర్గాల ప్రజలకు సైన్స్ ప్రాముఖ్యత, దానివల్ల కలిగే ప్రయోజనాలు వివరించేందుకు ఈ కళాజాత ప్రారంభించినట్టు చెప్పారు. ముఖ్యంగా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం కలిగించడానికి కృషి చేస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ ప్రయోగాలపై ఆసక్తి పెంచుకుని, సృజనాత్మకత పెంపొందించుకోవాలన్నారు. అనంతరం కళాకారులు సైన్స్‌పై ప్రదర్శించిన నాటికలు, నృత్య రూపకాలు, గీతాలు, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు బోర అప్పలరెడ్డి, నాయకులు శేషగిరిరావు, శ్రీకాంత్, రమణబాబు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

మధురవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు అంతా కృషి చేయాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. మధురవాడ వాంబే కాలనీ సునీల్ శర్మకాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎలిమెంటరీ స్కూల్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు నూతన పద్ధతులు ఉపయోగించి విద్యార్థులకు మరింత చక్కగా అర్థమయ్యే రీతిలో బోధించాలని ఆదేశించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలన్నారు. 9వ తరగతి విద్యార్థులు ట్యాబ్స్ వినియోగం పెంచాలని, పాఠాలు వీక్షించాలన్నారు. అనంతరం 5వ తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కూరమాన గీతాదేవి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దూరవిద్య పరీక్ష కేంద్రాల తనిఖీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న ఎంబీఏ, ఎంసీఏ, ఎంబీఏ హాస్పిటాలిటీ మూడో సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. ఏయూ ఐఏఎస్ఈ భవనంలో జరుగుతున్న పరీక్షలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

యూత్ హాస్టల్స్ నూతన కార్యవర్గం

ఉక్కునగరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉక్కునగరం యూనిట్‌కు నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. యూనిట్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో గత ఏడాది కాలంలో నిర్వహించిన కార్యక్రమాలు వివరించారు. కోశాధికారి తమ నివేదికను సమర్పించా రు. అనంతరం అధ్యక్షునిగా ఆర్.వి.వి.ఎస్.జగపతిరాజు, కార్యదర్శిగా జి.శ్రీనివాస్, చైర్మన్‌గా వి.ఆర్.కె.రాజు, ఉపాధ్యక్షులుగా ఎస్.భాస్కరరాజు, పి.శ్రీనివాసరావు, కోశాధికారిగా కె.సూర్యకుమార్‌తోపాటు 11 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎ న్నుకున్నారు. రాష్ట్ర శాఖ నుంచి కె.వి.రాజు, ఎస్.ఆర్.సి.మోహన్‌రావు పర్యవేక్షలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సాయిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

'మహోద్యమంగా కార్మికుల ఉక్కు దీక్ష'



దీక్షలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కార్మికులు చేస్తున్న దీక్ష మహోద్యమంగా మారనుందని, ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1092వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ సంపదను సృష్టించలేని కేంద్ర ప్రభుత్వానికి, ప్రభుత్వ సంస్థలను అమ్మే హక్కు లేదన్నారు.కార్మికులకు అన్యాయం చేస్తూ సంస్థను అమ్మడం దుర్మార్గమని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.